క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వేటపాలెం: దేశాయిపేట పంచాయతీ పరిధిలో 11 కేవీ విద్యుత్ లైన్స్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమోదగిరిపట్నం, సిలోన్ కాలనీ, జీవరక్షనగర్, ఐటీఐ కాలనీ, నీలకంఠాపురం, వివేకానంద కాలనీ, దంతంపేట, శాంతినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని తెలిపారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

హుండీ ఆదాయం రూ. 4.66 లక్షలు

వేటపాలెం: రామన్నపేట పంచాయతీ రావూరిపేట శివారులో వేంచేసియున్న కనక నాగవరపమ్మ అమ్మవారి హుండీ ఆదాయం రూ. 4,66,342 లక్షలు వచ్చినట్లు ఈఓ బి. శ్రీనివాసరావు తెలిపారు. ఆలయం ప్రాంగణంలో అమ్మవారి హుండీ కానుకలను శుక్రవారం లెక్కించారు. జూన్ నెలలో అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం జరగనున్నట్లు తెలిపారు. ఈఓ వేణుగోపాల్, శ్రీనివాస్‌బాబు, బండ్ల బాబు సిబ్బంది పాల్గొన్నారు.

జూన్ 1న వీరాంజనేయ స్వామి తిరునాళ్ల

మార్టూరు: మండలంలోని బబ్బేపల్లి రాజుగారిపాలెం గ్రామాల పొలిమేర మధ్య గల వీరాంజనేయ స్వామి తిరునాళ్లు జూన్ 1వ తేదీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరాంజనేయ స్వామి 37 వ తిరునాళ్ళ సందర్భంగా ఈ నెల 29 వ తేదీ బబ్బేపల్లి రాజుగారిపాలెం గ్రామాల్లో నగర సంకీర్తన, 30 వ తేదీ ఏకాహం కార్యక్రమం, 31వ తేదీ రెండు గ్రామాల భక్తులచే హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించనున్నట్లు లిపారు. ఉదయం శ్రీ సువర్చలాసహిత వీరాంజనేయస్వామి కళ్యాణం, సాయంత్రం 4 గంటలకు యడ్ల ప్రదర్శన, కోలాట ప్రదర్శన, బృందావన్ భజన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నామని, భక్తులు విరివిగా పాల్గొని తిరునాళ్ళు జయప్రదం చేయాలని కోరారు. పోస్టర్లు, కరపత్రాలు ఆవిష్కరించారు.

సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వరప్రసాద్

చినగంజాం: వేసవిలో గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ యూబీ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కోమట్ల అంకమ్మరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో గ్రామీణ నీటి పారుదల, వైద్య ఆరోగ్య శాఖ, ఉపాధి హామీ అధికారులు వేసవిలో తీసుకుంటున్న చర్యలు గురించి మాట్లాడారు. ఆయా శాఖల అధికారులకు తీసుకోవాల్సిన చర్యలు గురించి ఎంపీడీఓ సూచనలిచ్చారు. ఎన్నికల కోడ్ కావడంతో సమావేశాన్ని కొద్ది నిమిషాల్లో ముగించి మమ అనిపించారు. సమావేశాన్ని ఎక్కువ సేపు పొడిగించటం ద్వారా రాజకీయ అంశాలు చోటు చేసుకుంటాయని క్లుప్తంగా ముగించినట్లు ఎంపీడీఓ తెలిపారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యాభివృద్ధికి తోడ్పాటు


మాట్లాడుతున్న ప్రత్తి వెంకట సుబ్బారావు

వేటపాలెం: మండల పరిధిలో ప్రభుత్వం పాఠశాలల్లో పట్ట భద్రుల సంఘం ఆధ్వర్యంలో ప్రాథమిక విద్యాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని పట్ట భద్రుల సంఘం అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక పట్ట భద్రుల సంఘం ఆధ్వర్యంలో సభ్యులతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ప్రాథమిక పాఠశాలలకు 1 నుంచి రెండో తరగతి వరకు చదువు విద్యార్థులకు రెండు చెక్ బుక్కులు అందిస్తామని తెలిపారు. అదే విధంగా నాలుగు ఐదు తరగతులు చదివే విద్యార్థులకు నోటు పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. అక్కాయిపాలెంలోగల హైస్కూల్ మైదానంలో ఓపెన్ స్టేజీ ఏర్పాటు చేయడానికి రూ. 50 వేలు ఆర్థిక సహకారం కోరిన మీదట వారికి సహకారం అందిస్తామని చెప్పారు. స్థానిక విద్యా వనరుల కేంద్రంలో ఇనుప బీరువా అందజేస్తామని తెలిపారు. పాఠశాలలు ప్రారంభించిన వెంటనే ఈ కార్యక్రమాలు అమలు చేయడానికి సభ్యులు ఆమోదం తెలిపారని చెప్పారు. సంఘం సెక్రటరీ ఎస్వీఎల్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు బుర్రా సాంబశివరావు, డీవీఆర్ నాగరాజ్, రావి మస్తాన్ రెడ్డి, నాగంజనేయులు, బద్రిరెడ్డి, కరణం మురళీ కృష్ణ, పూల శ్రీను పాల్గొన్నారు.

సిమెంట్ బల్లల ఏర్పాటు


సిమెంట్ బల్లలు ఏర్పాటు చేసిన రోటరీ క్లబ్

పర్చూరు (చినగంజాం): మండలంలో రోటరీ క్లబ్ ఆఫ్ సెంట్రల్ సిమెంట్ బల్లలను సమకూర్చారు. నూతలపాడు, పోతులకట్లలో ప్రజల అవసరాల కోసం అనువైన ప్రదేశాల్లో కూర్చునేందుకు రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి, రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ సంయుక్తంగా శుక్రవారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామస్తులు విన్నపం మేరకు ఆయా గ్రామాల్లో ప్రజలకు అనువైన ప్రదేశాల్లో సిమెంట్ బల్లలు ఏర్పాటు చేసినట్లు, గతంలో నాగులుపాలెం గ్రామంలో కూడా 16 సిమెంట్ బల్లలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. క్లబ్ కార్యదర్శి పంబి సదానంద రెడ్డి, రోటరీ సభ్యులు పాబోలు ఉదయభాస్కర్, కోట శ్రీనివాసరావు, పాబోలు వెంకన్న, దండా శ్రీనివాసరావుస కోమట ఆంజనేయులు పాల్గొన్నారు.

రాయితీ విత్తనాలు సిద్ధం

కారంచేడు: ప్రభుత్వం 50 శాతం రాయితీపై అందించే పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె. సుధీర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని అన్ని ఆర్‌బీకే కేంద్రాల వద్ద ఈ సదుపాయం ఉందన్నారు. జీలుగు మార్కెట్ ధర రూ. 88 కాగా రాయితీ ధర రూ. 44 కే అందిస్తున్నామన్నారు. అలాగే జనుము కూడా రూ. 44లకే అందిస్తున్నామన్నారు. పిల్లిపెసర్లు అసలు ధర రూ. 134 కాగా, 50 శాతం రాయితీపై రూ రూ. 67లకే అందిస్తున్నామన్నారు. అవసరం ఉన్న రైతులు మీ ఆర్‌బీకేల వద్దకు పొలం పట్టాదారు పాస్‌పుస్తకం నఖలు, ఆధార్‌కార్డు నకలు తీసుకెళ్ళాలని ఆయన తెలిపారు.

అద్దంకి: మండలంలో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి వెంకట కృష్ణ శుక్రవారం తెలిపారు. మండలానికి జీలుగ 60 క్వింటాళ్లు, జనుములు 85 క్వింటాళ్లు, పిల్లిపెసలు 50 క్వింటాళ్లు రైతు భరోసా కేంద్రాల సిద్ధంగా ఉంచినట్లు ఏవో తెలిపారు. కావాల్సిన రైతులు యాభై శాతం రాయితీపై విత్తనాలు తీసుకెళ్లవచ్చునన్నారు. రాయితీ పోను కిలో జీలుగ, జనుములు రూ.44, పిల్లి పెసలు రాయితీపోను కిలో రూ.67 చెల్లించాలని తెలిపారు.

లక్కవరం విద్యార్థికి డాక్టరేట్


పల్లపాటి బాబు

మార్టూరు: మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన పల్లపాటి బాబు, డాక్టరేట్‌కు ఎంపికయ్యాడు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ఎడ్యుకేషనల్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన పరిశోధనా విద్యార్థి పల్లపాటి బాబు నాడు–నేడు పథకంపై సమర్పించిన 'డిజిటల్ కాంపిటెన్సీ అండ్ టీచర్ ఎఫెక్టివ్‌నెస్ ఆన్ టీచర్స్ ఆర్గనైజేషన్.. కమిట్‌మెంట్ ఆఫ్ సెకండరీ స్కూల్ టీచర్స్' అనే అంశంపై పీహెచ్‌డీకి ఎంపికైనట్లు యూనివర్శిటీ రీసెర్చ్ సెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్మయి తెలిపారు. గుంటూరు ఆంధ్ర లూథరన్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. ఎస్తేర్ సునీల పర్యవేక్షణలో థీసిస్ సబ్‌మిట్ చేసినట్లు బాబు తెలిపారు. డాక్టరేట్ పట్టాకు ఎంపికైన పల్లపాటి బాబును నాగార్జున యూనివర్శిటీ ఎడ్యుకేషనల్ డిపార్ట్‌మెంట్ ఆచార్యులు, రీసెర్చ్ స్కాలర్స్, లక్కవరం గ్రామస్తులు అభినందించారు.

శాంతి భద్రతలు సంతృప్తికరం


తహసీల్దార్ కృష్ణప్రసాద్

జె.పంగులూరు: మండలంలోని 21 గ్రామాల్లో ఎన్నికలు సజావుగా జరిగిందని, శాంతి భద్రతలు సంతృప్తికరంగా ఉన్నాయని తహసీల్దార్ జీఎస్ కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన పంగులూరులో విలేకరులతో మాట్లాడారు. మండలంలో శాంతి భద్రతలకు ఎలాంటి ఆటంకం లేదని తెలిపారు. ఎన్నికల రోజు కూడా ఇలాంటి సంఘటనలు వివాదాలు లేకుండా బాగా జరిగాయని, ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీసులు నిరంతరం నిఘా ఏర్పాటు చేశారని, శాంతి భద్రతలలో అదుపులో ఉన్నాయన్నారు. ప్రజలు ఏ పార్టీ గెలిచిన శాంతియుతంగా ఉండాలని కోరారు. జాతీయ రహదారి వెంబడి కొండమంజులూరు గ్రామ పంచాయతీ పరిధిలో సర్వే నెంబరు 58–1 లో రెండు ఎకరాల 42 సెంట్లు డొంక పోరంబోకు భూమి ఆక్రమణ గురైదని, అనేక మంది ఆక్రమించుకున్నారని ఈ ఆక్రమణలను వెంటనే తొలగించాలని లేకుంటే ప్రభుత్వ పరంగా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమణ దారుల వివరాలు సేకరించి వెంటనే వారిని తొలగించేందుకు గ్రామ పంచాయితీకి ఆదేశాలు పంపినట్లు తెలిపారు.

ప్రభుత్వ బడుల్లో బంగారు భవిష్యత్


కుంకలమర్రులో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల్లోనే మీ బిడ్డల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తామని, మీ బిడ్డలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం వివిధ గ్రామాల్లో క్యాంపెయిన్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ఎంతో నాణ్యమైన విద్య అందిస్తారన్నారు. అనుభవం కలిగిన ఉపాధ్యాయుల వద్ద చదువుకోవడం ఎంతో మేలు చేస్తుందన్నారు. కుంకలమర్రు హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బైక్, ఆటో ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు

చీరాల అర్బన్: బైక్, ఆటో ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి చీరాల ఆర్వోబీపై చోటు చేసుకుంది. పవన్, చారి అనే ఇద్దరు యువకులు బైక్‌పై శుక్రవారం రాత్రి ఆర్వోబీపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. ఈ సంఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. కొద్ది సమయం పాటు ట్రాఫిక్ నిలిచింది.

కారు బోల్తాపడి ఐదుగురికి గాయాలు


కొరిశపాడు సమీపంలో రోడ్డుపై బోల్తా పడిన కారు

మేదరమెట్ల: వాహనాన్ని అధిగమించే క్రమంలో అదుపు తప్పిన కారు బోల్తా పడటంతో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కొరిశపాడు సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. గుంటూరు వైపు నుంచి ఒంగోలు వైపు వస్తున్న కారు కొరిశపాడు సమీపానికి రాగానే ముందు వెళుతున్న లారీని అధిగమించబోయి లారీని ఢీ కొంది. దీంతో అదుపు తప్పిన కారు రోడ్డుపై బోల్తా పడింది. 108 వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించినట్లు మేదరమెట్ల పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియరాలేదు.